క్లుప్తంగా

కొవ్వూరు విద్యార్థినికి ఇంటర్లో 985 మార్కులు



బత్తి హిమ వర్ష

కొవ్వూరు: పట్టణానికి చెందిన 10వ వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు కుమార్తె బత్తి హిమవర్ష ఇంటర్ మీడియట్ పరీక్షల ఎంపీసీ గ్రూపులో 985 మార్కులు సాధించింది. రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కాతేరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆమె చదువుతోంది. ఫస్టియర్ లోను ఆమె 470 కి గాను 462 మార్కులు సాధించింది. పదో తరగతిలో 9.8 గ్రేడ్ సాధించింది. జేఈఈ మెయిన్స్ ఫలితాల కోసం ఆమె ఎదురు చూస్తోంది. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చదవాలనుకుంటున్నట్టు ఆమె తెలిపింది.

మండల ప్రత్యేకాధికారిగా జగదాంబ



దేవరపల్లి: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)ఎస్. జగదాంబ నియమితులయ్యారు. కలెక్టర్ కె. మాధవీలత ఆదేశాల మేరకు బుధవారం దేవరపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జగదాంబ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, జగనన్న కాలనీల నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లు వంటి కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ప్రతి మండలానికి జిల్లాస్థాయి అధికారిని ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం నియమించిందన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు స్వర్ణలతల సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.

నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా స్వామినాయుడు

నిడదవోలు రూరల్: నవరత్న పథకాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా ఏపీ టూరిజం జిల్లా రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు నియమితులయ్యారు. అలాగే నిడదవోలు మండల ప్రత్యేకాధికారిగా ఎస్. మాధవరావు (జిల్లా వ్యవసాయాధికారి), ఉండ్రాజవరం మండల ప్రత్యేకాధికారిగా వి.కృష్ణారావు (జిల్లా మత్స్యశాఖాధికారి), పెరవలి మండల ప్రత్యేకాధికారిగా ఎస్.సుభాషిణి (డీఆర్డీఏ పీడీ)లను నియమించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

నిడదవోలు రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి ఎస్.మాధవరావు సూచించారు. సమిశ్రగూడెంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులు, పేదలందరికీ ఇళ్లు, నాడు-నేడు పనులపై బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలన్నారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అనంతరం పందలపర్రు, డి.ముప్పవరం, సమిశ్రగూడెం సచివాలయాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, వైఎస్సార్ జగనన్న కాలనీలను పరిశీలించి లబ్ధిదారులు, రైతులతో మాట్లాడారు. ఎంపీడీఓ టి.మూర్తిబాబు, ఏఓ జి.సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూక పేరుతో మిల్లర్ల దోపిడీ

చాగల్లు: అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతున్న రైతులను రైస్ మిల్లర్లు దోచుకుంటున్నారని రైతు సంఘం నాయకుడు కంకటాల బుద్ధుడు ఆరోపించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ రబీ ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర ఇస్తుండగా, మిల్లులకు తీసుకువెళ్లిన ధాన్యంలో నూక శాతం 40 నుంచి 30 శాతం ఉందనే సాకుతో బస్తాకు రూ.100 నుంచి రూ.150 వరకూ రైతులు చెల్లించాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారన్నారు. డబ్బులు చెల్లిస్తేనే ధాన్యం దిగుమతి చేయాలని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం నాయకులు గారపాటి సుబ్బారావు, కొడవటి వెంకటరాయుడు, పి.పల్లంరాజు, బాపిరాజు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోపాలపురం: రైస్ మిల్లర్ల చర్యను నిరసిస్తూ మండలంలోని చెరుకుమిల్లికి చెందిన కాండ్రు సత్యనారాయణ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని కోమటికుంట వద్ద గల మాతంగి తల్లి రైసుమిల్లు వద్ద జరిగింది. రైతుల నుంచి సేకరిస్తున్న రబీ ధాన్యంలో నూక శాతం ఎక్కువగా ఉందని చెబుతూ మిల్లర్లు ఒక్కో బస్తాకు ఐదు నుంచి 15 కేజీల వరకూ ధాన్యాన్ని తగ్గించి రేటు లెక్క కడుతున్నారు. ఈ చర్యను నిరసిస్తూ గోపాలపురం, దేవరపల్లి మండలాల రైతులు బుధవారం ఆందోళన చేసి, గోపాలపురం తహసీల్దార్ బి.రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు సాయంత్రం మండలంలోని కోమటికుంట రైసుమిల్లు వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సమయంలో వారిలో ఒకరైన కాండ్రు సత్యనారాయణ ఆత్మహత్య చేసుకునే ఉద్దేశంతో తన ఒంటిపై పెట్రోల్ పోసుకోబోయాడు. ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, మండల ప్రత్యేకాధికారి సత్యగోవింద్ అడ్డుకున్నారు. రైతుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

రోడ్లు నునుపుగా.. ప్రయాణం సులువుగా

- నియోజకవర్గంలో భారీ ఎత్తున పునర్నిర్మాణం
- గ్రామాలను కలుపుతూ అభివృద్ధి

కొవ్వూరు: నియోజకవర్గంలో రహదారులు కొత్త రూపును సంతరించుకుంటున్నాయి. ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన రోడ్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పునర్నిర్మాణానికి నోచుకుంటున్నాయి. ఇందుకు హోం మంత్రి తానేటి వనిత చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. ఇప్పటికే పలు రహదారుల రూపురేఖలు మారాయి. గ్రామ సడక్ యోజనలో కలవలపల్లి నుంచి కోరుమామిడి వరకూ రూ.7.84 కోట్ల వ్యయంతో రూ.13.08 కిలోమీటర్ల పొడవైన రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. గతేడాది కాలంలో రూ.16.52 కోట్ల వ్యయంతో ఆరు ఆర్ అండ్ బీ రహదారులను పునర్నిర్మించారు. వాటిలో కొవ్వూరు నుంచి నందమూరు మీదుగా చాగల్లు, కొవ్వూరు, వేములూరు మీదుగా పశివేదల, చాగల్లు నుంచి పశివేదల రోడ్డు, సీతంపేట జంక్షన్ నుంచి కొవ్వూరు వరకు, దొమ్మేరు నుంచి పెనకనమెట్ట మీదుగా ధర్మవరానికి నిర్మించారు. అలాగే దారవరం నుంచి మార్కొండపాడు మీదుగా పశివేదల వరకు, తోగుమ్మి గ్రామంలో సిమెంటు రోడ్డు వంటివి నిర్మించారు. కొవ్వూరు నుంచి తాళ్లపూడి ఏటిగట్టు రోడ్డు, ప్రక్కిలంక నుంచి చిట్యాల, గజ్జరం నుంచి గోపవరం రోడ్డు రూపుదిద్దుకున్నాయి. ఆర్ అండ్ బీ పరిధిలోని దారవరంలోని రోడ్డును రూ.2.35 కోట్లతో సిమెంట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. నిడదవోలు నుంచి కొవ్వూరు మండలం ధర్మవరం వరకూ రూ.23 కోట్ల సెంట్రల్ రిలీఫ్ ఫండ్‌తో 15 కిలోమీటర్ల పొడవునా ఈ రోడ్డు పనులు చేపట్టారు.



నిడదవోలు-ధర్మవరం రహదారి నిర్మాణం (ఫైల్)



కొవ్వూరు-విజ్జేశ్వరం ఏటి గట్టు రోడ్డు

నిడదవోలు నుంచి చాగల్లు, ఐ.పంగిడి, కాపవరం జంక్షన్ మీదుగా ధర్మవరం వరకూ ఈ రహదారిని నిర్మించారు. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాల్లో 26 పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి రూ.1874.80 లక్షలు మంజూరయ్యాయి. వాటిలో ఆరు ఇప్పటికే టెండర్లు పూర్తి చేసుకుని పనుల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.మరో తొమ్మిది పనులు టెండర్ దశలోను, ఎనిమిది పనులు అగ్రిమెంట్ స్థాయిలోను ఉన్నాయి. రెండు పనులను మాత్రం నిలిపివేశారు.

ప్రారంభ దశలో ఆరు రోడ్ల నిర్మాణం

ఏపీఆర్ఆర్‌పీ నుంచి రూ.534.59 లక్షల వ్యయంతో 15.39కిలో మీటర్లు పొడవున చేపట్టి న ఆరు రోడ్లు నిర్మాణ పనులు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది.చాగల్లు మండలంలో ఉన్న గట్ల నుంచి అమ్మికుంట వరకు మూడు కిలోమీటర్లు వరకు రూ.103.5లక్షల వ్యయంతో రోడ్డు పనులు ఇటీవల హోమ్ మంత్రి వనిత ప్రారంభించారు.తాళ్లపూడి మండలం పెద్దేవం నుంచి చిడిపి వరకు రూ.42.44లక్షల వ్యయంతో 1.22 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. తిరుగుడుమెట్ట నుంచి అన్నదేవరపేట వరకు రూ.68.83కోట్లు వ్యయంతో 1.94కిలో మీటర్లు పొడవునా రోడ్డు నిర్మించనున్నారు.మలకపల్లి నుంచి తిరుగుడుమెట్ట వరకు రూ.134.55 లక్షల వ్యయంతో 4.23కిలో మీటర్లు పొడవున రోడ్డు నిర్మించనున్నారు. అఖండ గోదావరి రివర్ బ్యాంకు (ఏజీఆర్‌బీ) రోడ్డు ఏటి గట్టు నుంచి బల్లిపాడు వెళ్లే రహదారి రూ.35.19లక్షల అంచనా వ్యయంతో కిలోమీటరు దూరం పొడైన పునర్ నిర్మాణం, చాగల్లు నుంచి రాళ్లమడుగు బ్రిడ్జి మీదుగా కాపవరం వరకు రూ.150.08కోట్లు వ్యయంతో నాలుగు కిలో మీటరు దూరం రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు.

టెండర్ దశలో..

కొవ్వూరు మండలంలో రూ.526 లక్షల వ్యయంతో 14.80 కిలోమీటర్ల పొడవైన మరో తొమ్మిది రోడ్ల నిర్మాణాలను టెండర్లు ఖరారు కావాల్సి ఉంది. ఈ అన్ని రోడ్లకు ఒకటే ప్యాకేజీగా తొలుత అధికారులు టెండర్లు పిలవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వీటిని విడివిడిగా లేదంటే రెండు, మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులు యోచిస్తున్నారు. సీతంపేట నుంచి మద్దూరు వెళ్లే రోడ్డుకు రూ.85 లక్షలు, ఐ.పంగిడిలోని ఈజీకే రోడ్డు నుంచి మండల పరిషత్ రోడ్డుకు రూ.20 లక్షలు, దేచెర్ల అప్రోచ్ రోడ్డుకు రూ.20 లక్షలు కేటాయించారు. 3.4 కిలోమీటర్ల పొడవైన పెనకనమెట్ట- కుమారదేవం రోడ్డుకు రూ.1.03 కోట్లు, 2.9 కిలోమీటర్ల పొడవైన చంద్రవరం-వాడపల్లి కాలనీ రోడ్డుకు రూ.97 లక్షలు ప్రత్యేకించారు. అలాగే ఆరికిరేవులలోని ఏజీఆర్‌బీ రోడ్డు నుంచి ఐఎల్‌డీఈ రోడ్డు పనులకు కూడా త్వరతగతిన టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

అగ్రిమెంట్ దశలో ఎనిమిది..

ఏపీ రూరల్ రోడ్ కనెక్టివిటీ ప్రాజెక్టు (ఏపీఆర్ఆర్‌పీ) కింద ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ఆర్థిక సాయంతో ఎనిమిది రహదారుల పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ పనులు ప్రస్తుతం అగ్రిమెంట్ దశలో ఉన్నాయి. చాగల్లు ఇందిరమ్మ కాలనీ రోడ్డుకు రూ.77 లక్షలు మంజూరు చేశారు. అలాగే మల్లవరం రైల్వే ఫీడర్ రోడ్డు, దొమ్మేరు నుంచి ధర్మవరం రోడ్డు, వేగేశ్వరపురం నుంచి అన్నదేవరపేట రోడ్డు, అన్నదేవర పేట నుంచి సూరయ్యపేట రోడ్డు, దారవరం రోడ్డు, కుమారదేవంలో సంక్రాంతి చెరువు నుంచి పెనకనమెట్ట రహదారులు ఇందులో ఉన్నాయి.

> **రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం**
>
> నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల నిర్మాణం చేపట్టాం. ఆర్ అండ్ బీ పరిధిలోని ముఖ్యమైన రోడ్లన్నీ దాదాపు పూర్తిచేశాం. జిల్లా పరిషత్ పరిధిలోని 26 రోడ్లకు ఏపీఆర్ఆర్‌పీ కింద ఏఐఐబీ ఆర్థిక సాయంతో రూ.18.74 కోట్లు మంజూరయ్యాయి.ఈ పనులు కుడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రోడ్ల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించింది.
>
> 
>
> – తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

మాట నిలబెట్టుకునే నేత జగన్



గోపాలపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నాయకులు

- ఈ విషయం ప్రజలు గుర్తించారు
- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్ ఆవిష్కరణ

గోపాలపురం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కోటి కుటుంబాలకు చేరువ కావడం అభినందనీయమని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలూ మా నమ్మకం నువ్వే జగనన్నా అంటున్నారన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుర్తించారన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పదవులకు వన్నె తేవాలి



నగళ్లపాటి శ్రీనివాస్, వరిగేటి సుధాకర్‌లను అభినందిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- బాధ్యతలు స్వీకరించిన సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు

కొవ్వూరు: పదవులు అలంకారప్రాయం కాకుండా, పేద రోగులకు మెరుగైన వైద్యం అందేలా పని చేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సూచించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన నగళ్లపాటి శ్రీనివాస్, వరిగేటి సుధాకర్‌లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని ఇప్పటి వరకూ అపవాదు ఉండేదని, ఇక మీదట అలా జరగకుండా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ఆసుపత్రి స్థాయిని 50 పడకల నుంచి 100 పడకల స్థాయికి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.అనంతరం నూతన కమిటీ సభ్యులు శ్రీనివాస్, సుధాకర్‌లను మంత్రితో పాటు నాయకులు ఘనంగా సత్కరించారు.

వైద్య సేవల పరిశీలన

అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను మంత్రి వనిత స్వయంగా పరిశీలించారు. పలు వార్డుల్లోకి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న వారికి, అవుట్ పేషెంట్లను వైద్య సేవల గురించి మంత్రి ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజినీదేవి, డీసీహెచ్ఎస్ కె.సనత్ కుమారి,ఆసుపత్రి సూపరింటెండెంట్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అన్నదేవరపేటలో గడప గడపకూ..

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో గురువారం నుంచి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీవో ఎం.రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఈ నెల 29 వరకూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం రోజూ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

• పాపాయిలా బొప్పాయి



కోట్ల నానాజీ ఇంటి ప్రాంగణంలో గోడలో మొలిచిన బొప్పాయి చెట్టు కాయలతో ..

కొవ్వూరు: కొందరు మొక్కలకు అన్ని పోషకాలూ అందించినా, అవి పండ్లు ఇవ్వవు. అందుకు భిన్నంగా పూర్తి ప్రతికూల పరిస్థితుల్లో పెరిగిన ఓ బొప్పాయి చెట్టు తియ్యని ఫలాలు ఇస్తోంది. పాపాయిలో పడుకున్న ఆ బొప్పాయి గురించి తెలుసుకుందాం. పట్టణంలోని కోట్ల సత్యనారాయణ (నానాజీ) ఇంటి గోడలో నుంచి ఆ బొప్పాయి మొక్క మొలిచింది. క్రమక్రమంగా పెద్దదైంది. ఎలాంటి పోషణ లేకుండానే విరగ కాస్తోంది. కాయలు భలే తీపిగా ఉంటున్నాయని యాజమాని నానాజీ చెబుతున్నారు. ఇప్పటి వరకూ యాభైకి పైగా కాయలు కాశాయి. అసలు గోడలో ఎలా మొలిచిందో తెలియదు. ఒకసారి పీకేద్దామనుకుంటే అప్పటికే చిన్న చిన్న పిందెలు ఉండడంతో ఆ పని చేయలేదు. చుట్టుపక్కల వారు ఈ చెట్టును చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వాహనాల వేలం ఆదాయం రూ.1.14 లక్షలు

కొవ్వూరు: సారా, ఇతర కేసుల్లో పట్టుబడిన తొమ్మిది మోటార్ సైకిళ్లను పట్టణంలోని ఎస్ఈబీ స్టేషన్‌లో బుధవారం వేలం నిర్వహించినట్టు ఎస్ఈబీ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. తొమ్మిది వాహనాలకు ప్రభుత్వం నిర్దేశించిన ధర రూ.87 వేలు. కాగా వేలంలో రూ.1,14,100 లభించినట్టు ఆయన తెలిపారు. వేలం సొమ్ముతో పాటు 18 శాతం జీఎస్టీ కలిపి పాటదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

దేవరపల్లిలో రూ.1.35 లక్షలు

దేవరపల్లి: స్థానిక ఎస్ఈబీ పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడిన 18 వాహనాలకు బుధవారం స్టేషన్ వద్ద అధికారులు బహిరంగ వేలం వేశారు. వేలం ద్వారా రూ.1,35,200 ఆదాయం వచ్చినట్టు సీఐ సుధ తెలిపారు. జీఎస్టీగా మరో రూ.24,336 చెల్లించినట్టు ఆమె చెప్పారు. అనంతరం మధ్యవర్తల సమక్షంలో ఫిబ్రవరిలో ఏడు కేసుల్లో పట్టుబడిన 85 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు ఆమె చెప్పారు. ఎస్ఈబీ జిల్లా అధికారి పిట్టా సోమశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి ఊరంతా జాతరే



మోదుగులమ్మ జాతరలో నిర్వహిస్తున్న బలిచేట



సినీ నిర్మాత దానయ్యను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- ముగిసిన మోదుగులమ్మ వారి జాతర

తాళ్లపూడి: ఊరంతా జతరే జాతర అన్నట్టుగా జనం తరలి వచ్చారు. తాళ్లపూడి గ్రామదేవత మోదుగులమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. అమ్మవారికి గ్రామస్తులు బుధవారం నైవేద్యాలు సమర్పించారు. బుధవారం తెల్లవారుజాము వరకూ బలిచేట కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన బాణాసంచా కాల్పులు విశేషంగా ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా బంధువులు, ఊరి ఆడపడుచులు తరలి రావడంతో గ్రామంలో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. మహిళలు ఉదయం నుంచీ అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు, కానుకలు, నైవేద్యాలు సమర్పించారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ నామన పరమేశ్వరరావు, నక్కా చిట్టిబాబు, జడ్డు శ్రీను, గుండుబోగుల ప్రసాద్, బండారు నాగేశ్వరరావు, సిద్ధంశెట్టి కృష్ణ, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సినీ నిర్మాత దానయ్యకు సత్కారం

ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దానయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దానయ్య మాట్లాడుతూ తాను పుట్టిన ఈ ఊరు కన్న తల్లితో సమానం అన్నారు. తాను ఏ స్థాయిలో ఉన్నప్పటికీ తన ఊరిని ఇక్కడి ప్రజల అభిమానాన్ని, తన స్నేహితులను మరిచిపోనన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- మండల సర్పంచులకు సన్మానం



సర్పంచులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: గ్రామాల అభివృద్ధిలో ఆయా పంచాయతీ సర్పంచులది కీలక పాత్ర అని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 18 మంది సర్పంచులను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ నిర్వహణలో సర్పంచులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం ప్రజలకు అందేలా ఆయా పంచాయతీల సర్పంచులు కృషి చేశారంటూ కొనియాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆయన రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన గోపాలపురం- భీమోలు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, మహిళా అధ్యక్షురాలు యండపల్లి కవిత, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, సర్పంచులు పైడి శిరీష, యండపల్లి శేఖర్‌బాబు, పఠాన్ అన్సర్‌బాషా పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించండి



బంధపురం జగనన్న లే అవుట్ వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీపీవో జగదాంబ

దేవరపల్లి: రెండో విడతలో ప్రభుత్వం మండలానికి మంజూరు చేసిన జగనన్న గృహాల నిర్మాణాలు వెంటనే చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో), మండల ప్రత్యేక అధికారి ఎస్.జగదాంబ లబ్ధిదారులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. త్యాజంపూడి ఆర్‌బీకే వద్ద గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తొలుత సందర్శించారు. రామన్నపాలెంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. బంధపురం జగనన్న కాలనీలోని ఇళ్ల స్థలాలను పరిశీలించి, జియో ట్యాగింగ్ గురించి గృహ నిర్మాణశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సుమారు 140 మందికి ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చినట్టు ఏఈ ధర్మారావు తెలిపారు. సర్వేయర్లను ఏర్పాటు చేసి వెంటనే రాళ్లు పాతించేలా చర్యలు తీసుకుంటానని జగదాంబ అన్నారు. లబ్ధిదారులతో మాట్లాడారు. జియో ట్యాగింగ్ చేసిన స్థలాల్లో గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని కాలనీలో బోరు, విద్యుత్ సదుపాయం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతు ఇబ్బంది లేకుండా ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని మిల్లుకు పంపించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు పిచికారీ పనికి వెళ్లి మృతి

చాగల్లు: మిరప తోటకు పురుగు మందు పిచికారీ చేసే పనికి వెళ్లిన ఓ వ్యాధిగ్రస్తుడు మృతి చెందాడు. చాగల్లు ఎస్ఐ సీహెచ్‌వీ రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో మల్లవరానికి చెందిన ఇ.భద్రం (45) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం గ్రామంలోని మిరప తోటకు పురుగుమందు పిచికారీ చేసేందుకు అతడు కూలి పనికి వెళ్లాడు. భద్రం అక్కడ స్పృహ కోల్పోయి పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.